సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం | 27 | జూలై | 2025



జల విషాదానికి రెండేళ్లు..

భూపాలపల్లి మండలం మోరంచవాగు ఉప్పొంగి మోరంచపల్లి గ్రామం మొత్తం మునిగిన ఘటనకు రెండేళ్లు అయినా గ్రామస్తులు మరువలేకపోతున్నారు. - 8లో▸



డిగ్రీ పరీక్షల టైంటేబుల్ విడుదల

దూరవిద్య ఇయర్ వైజ్ డిగ్రీ పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ శనివారం విడుదల చేశారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.3^0 / 25.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో చిరు జల్లులు కురుస్తాయి. రాత్రి సమయంలో భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

గణపురం: గణపురం మండలం చెల్పూర్ కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో శనివారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. కాకతీయ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని మొదటి దశ 500 మెగావాట్లలో ఉదయం నుంచి విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్రధాన ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు కేటీపీపీ అధికార వర్గాలు తెలిపాయి. మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని త్వరలోనే విద్యుత్ పునరుత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



మల్హర్: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లోకి భారీగా వర్షపు నీరు చేరి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్ట్‌లో రోజుకు లక్ష మెట్రిక్ టన్నుల ఓబీ, ఆరు వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మైన్ మొత్తం బురదమయంగా మారి వాహనాలు కదలని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దీంతో 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గు, 5లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయని వెల్లడించారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు



మల్హర్: మండలంలోని పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వీరభద్రయ్య ఆదేశించారు. మండల కేంద్రం తాడిచర్లలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను డీపీఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లోని ప్రతీ వార్డులో చెత్తాచెదారంతో పాటు మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ వేయాలని తెలిపారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

నేడు కేటీఆర్ రాక

భూపాలపల్లి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నేడు (ఆదివారం) జిల్లాకు రానున్నారు. ఉదయం 11.30 గంటలకు మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చేరుకొని మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మొగుళ్లపల్లి మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. అనంతరం చిట్యాల మీదుగా జిల్లాకేంద్రానికి చేరుకొని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్: ఓపెన్ ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజులను ఆగస్టు 5వ తేదీలోపు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత పొందని వారు, గత సంవత్సరంలో ప్రవేశం పొంది పరీక్ష రాయని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.25 అపరాధ రుసుంతో ఆగస్టు 10వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో 15వ తేదీలోపు తత్కాల్ ఫీజుతో 18వ తేదీలోపు ఫీజు చెల్లించాలని కోరారు.

బ్యాంకు ఖాతాలను మార్చుకోవాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్న బ్యాంకులకు తమ ఖాతాలను మార్చుకోవాలని ఏరియా అధికార ప్రతినిధి మారుతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల బీమా సౌకర్యం కల్పనపై గతంలో వివిధ బ్యాంకులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు 323 మంది బీమా సౌకర్యం కలిగిన బ్యాంకులో ఖాతాలు తీసుకోవాలని కోరారు.

అమ్మ ప్రేమ.. నాన్న సూచన



తల్లిదండ్రులు పుష్ప, రాంనాథ్‌తో మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

సాక్షి, మహబూబాబాద్: ఈసృష్టిని పరిచయం చేసింది అమ్మానాన్నే. వారి తపనంతా మేం ప్రయోజకులు కావాలనే. నాన్న చిరు ఉద్యోగి. అయినా ఆయన ఆశయం పెద్దగా ఉండేది. మా ముగ్గురు అన్నదమ్ములతో సరదాగా ఉంటూ ఉన్నతి గురించి చెప్పేవారు. అందుకే నాన్నంటే ప్రేమతో కూడిన భయం. అమ్మ ద్వారా ఆరోగ్య సమాచారం తెలుసుకుంటూ నా లక్ష్యాలను గుర్తు చేసేవారు. అమ్మప్రేమ, నాన్న సూచనే ఐపీఎస్ సాధించాలనే కసిని పెంచింది. ఐపీఎస్ సాధించిన రోజు నాన్న కళ్లలో ఆనందం.. ఇంట్లో అంతా పండుగ వాతావరణం ఉందని, ఇప్పటికీ గుర్తుకు వస్తాయని మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు.

తల్లిదండ్రులే నాకు ధైర్యం



తల్లిదండ్రులతో మంత్రి సీతక్క

ఏటూరునాగారం: ములుగు మండలం జగ్గన్నపేటకు చెందిన సమ్మయ్య, సమ్మక్క దంపతుల కుమార్తె ధనసరి అనసూర్య (సీతక్క). 1971 జూలై 9న ఆమె జన్మించారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రుల గురించి ఆమె మాటల్లోనే.. 'పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అమ్మానాన్న ఆశీర్వాదమే నాకు బలం, ధైర్యం. వారి నుంచి ఆశీర్వాదం తీసుకోకుండా ఏ పనీ మొదలుపెట్టను. నేను మంత్రినయినా.. వారికి బిడ్డనే. తల్లిదండ్రులకన్నా గొప్పవారు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. వారి తర్వాతే ఎవరైనా.. ప్రతీ వ్యక్తి తల్లిదండ్రులను చూసుకోవాలన్నదే నా కోరిక. చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని పెంచి పెద్ద చేశారు.

వ్యవసాయం చేసి.. కొడుకును అమెరికా పంపారు



టేకుమట్ల: ఈఫొటోలో కొడుకు, కోడలు, మనవళ్లతో ఉన్న వృద్ధ దంపతులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దూబల శ్రీనివాస్–సరోజన. వీరికి ముగ్గురు కుమారులు.. కాగా పెద్ద కుమారుడు రమేశ్ తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తుండగా.. రెండో కుమారుడు వెంకటేశ్ ఎంసీఏ, చిన్న కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. ఉన్న కొద్ది పాటి భూమిలో సాగు చేసుకుంటూ, మరికొన్ని రోజులు కూలీలుగా పనులు చేస్తూ కుమారులను ప్రయోజకులను చేశారు. కష్టపడి చదివించారు. ఎంసీఏ పూర్తి చేసిన రెండో కుమారుడు వెంకటేశ్ 2008లో అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. 2012, 2023లో రెండు సార్లు అమెరికాకు తీసుకెళ్లి అక్కడి పర్యాటక ప్రాంతాలను తల్లిదండ్రులకు చూపించాడు.

కలలకు రంగులద్దారు. ఆశలకు జీవం పోశారు. భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. తిన్నాతినకపోయినా.. అడిగిందల్లా కొనిపెట్టారు. అలాంటి అమ్మానాన్నలు కనిపించే దైవాలు. నేడు (ఆదివారం) జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వారి తల్లిదండ్రులతో ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ కథనాలే సాక్షి సండే స్పెషల్.



అమ్మానాన్నకు ప్రేమతో..

శ్రమకోర్చి ప్రయోజకుల్ని చేసి..

సండే స్పెషల్

- జీవితాలకు బాటలు వేసిన తల్లిదండ్రులు
- ఆదర్శంగా నిలుస్తున్న పేరెంట్స్
- నేడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం
- అనుబంధాన్ని పంచుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తల్లిదండ్రులతో జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

జనగామ: నాన్న అబ్దుల్ మజీద్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేశారు. అమ్మ షీరీ గృహిణి. పంద్రాగస్టు, జనవరి 26 ఇలా జాతీయ దినోత్సవ కార్యక్రమాల వేళ నాన్న తన వెంట తీసుకెళ్లేవారు. అప్పుడే కలెక్టర్ కావాలనే తపన కలిగింది. చదువు విషయంలో నాన్న ఎప్పుడు రాజీ పడలేదు. కష్టపడి చదువుకుని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం సంపాదించా. నాలుగేళ్లు పని చేశా. అయినా తృప్తి లేదు. నాన్నా.. నేను సివిల్ సర్వీసు వైపు వెళ్తా అన్నాను. 'గో హెడ్' అన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేశా. అంత పెద్ద జాబ్ వదులుకున్నా, మొదటిసారి ర్యాంకు రాకపోయినా.. ప్రోత్సహించారు. నాన్న ఎలాంటి ఒత్తిడి లేకుండా పెంచారు. తల్లిదండ్రులకు ఎంత చేసినా తక్కువే. నవమాసాలు మోసి, కనిపెంచిన తల్లి, మన భవిష్యత్‌కు బాటలు వేసే తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకుంటేనే పిల్లల జన్మకు సార్థకత అని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు.

సోషల్‌మీడియాకు దూరంగా ఉంచాలి



కాజీపేట అర్బన్: తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులకనుగుణంగా ప్రోత్సహించాలని సైకాలజిస్ట్ బరుపాటి గోపి సూచించారు. వారిపై ఒత్తిడి పెంచకూడదని, నైతిక విలువలు నేర్పిస్తే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. శనివారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. పిల్లలకు చదువుపై ఆసక్తి కల్పించాలని, స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా ఉండాలని చెప్పారు. పుస్తకాలను చదివేవిధంగా ప్రోత్సహించాలని, మొబైల్ వాడకుండా, సోషల్‌మీడియాకు ఆకర్షితులు కాకుండా చూడాలని, టెక్నాలజీతో కలిగే దుష్ఫలితాలు తెలియజేయాలని కోరారు. విద్యలో ఫలితాల కంటే ప్రయత్నంపై పట్టు సాధించాలని, మంచి స్నేహితులు ఉండేవిధంగా ప్రేరేపించాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షించాలి

'సాక్షి'తో వరంగల్ నార్కొటిక్ విభాగ డీసీపీ సైదులు



సాక్షి, వరంగల్: మాదకద్రవ్యాల వ్యసనం ఎన్నో కుటుంబాల్లో కల్లోలం రేపుతోంది. దీనికి అలవాటుపడిన వారిలో ఎక్కువగా యువత ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కళాశాలలకు వెళ్లే విద్యార్థులే తప్పుదారి పడుతున్నారు. చెడు స్నేహాలు, ఒకరిని చూసి మరొకరు ఇలా మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారు. ఈనేపథ్యంలో తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వరంగల్ నార్కొటిక్ విభాగం డీసీపీ సైదులు 'సాక్షి'కి శనివారం తెలిపారు. కుటుంబం తీసుకునే ప్రత్యేక జాగ్రత్తలతో డ్రగ్స్, గుట్కా, గంజాయి, సిగరెట్ మొదలగు చెడు అలవాట్ల వైపు రాకుండా చూడాలని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ఆ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు రోల్‌మోడల్‌గా ఉండాలని సూచించారు. ఇంట్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వ్యసనాలకు అలవాటుపడకుండా చూసుకోవాలని, ఒకవేళ పిల్లలు మాదకద్రవ్యాలకు బానిసలైనట్టు తెలిస్తే వెంటనే నిపుణుల సాయం తీసుకోవాలని పేర్కొన్నారు.

శ్రావణ మాసం పూజలు



అభిషేక పూజలు చేస్తున్న భక్తులు



నవగ్రహాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాసం పూజలను భక్తులు నిర్వహించారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశుభానంద దేవి, శ్రీమహాసరస్వతి అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు. నవగ్రహాల వద్ద శని, శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కాలసర్ప నివారణ పూజలను భక్తులు అధికంగా నిర్వహించారు. వర్షం కారణంగా భక్తుల రద్దీ అంతంతగా కనిపించింది.

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మల్హర్: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తప్పిదాలకు తావులేకుండా త్వరితగతిన పరిష్కరించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. మండల కేంద్రం తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను తహసీల్దార్ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అన్ని దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషిచేయాలని తహసీల్దార్‌కు సూచించారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. యూరియా స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



కాటారం: దరఖాస్తుల వివరాలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

కాటారం: భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుదారులకు నోటీసులు జారీచేసి పరిశీలన పూర్తిచేయాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మహాముత్తారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం సబ్‌కలెక్టర్ తనిఖీచేశారు. నూతనంగా నిర్మిస్తున్న కేజీబీవీ భవనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. అధికారులు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ఓరుగల్లు అభివృద్ధిపై ఫోకస్

ప్రత్యేక దృష్టిసారించిన ప్రభుత్వం.. సీఎం, మంత్రుల వరుస సమీక్షలు

- త్వరలో ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం
- మెగా టెక్స్‌టైల్ పార్కు, 'భద్రకాళి', 'స్మార్ట్' పనుల పరుగులు
- హైదరాబాద్‌లో సమీక్షించిన ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు



హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, సీపీ, ఎస్పీలతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రులు కొండా సురేఖ, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బండా ప్రకాశ్, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లాలో పర్యటించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రకటించారు. ఈమేరకు సీఎం, మంత్రులు ఓరుగల్లు అభివృద్ధిపై తరచూ సమీక్షలు చేస్తున్నారు. తాజాగా.. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయంలో వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్కు, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

ఓరుగల్లు అభివృద్ధిపై ఆశలు..

మామునూరు ఎయిర్‌పోర్ట్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు తదితర అంశాలపై సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కలెక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని, ఇందుకు అవసరమైన భూసేకరణ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, రూ.205 కోట్లు విడుదల చేశామని, భూ సేకరణకు గ్రీన్‌చానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి అక్కడ రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో ఆర్–ఆర్ ప్యాకేజీ కింద 1,398 మంది లబ్ధిదారులను గుర్తించి 863 ప్లాట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కాలనీలో సెప్టెంబర్ నెలాఖరు నాటికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వెటర్నరీ హాస్పిటల్, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించాలని, మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. 2057జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్‌లో రూ.4,170కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను త్వరగా ప్రారంభించాలని, పనులను విభజించుకుని దశల వారీగా చేపట్టాలని మార్గదర్శనం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహశబరీష్, సత్యశారద, రిజ్వాన్‌బాషా షేక్, వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీలు శబరీష్, కిరణ్‌ఖరే పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా భద్రకాళి..

భద్రకాళి ఆలయ మాడవీధులతోపాటు కల్యాణ మండపం, పూజారి నివాసం, విద్యుత్ అలంకరణను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు తానే స్వయంగా వస్తానని, రోప్‌వే, గ్లాస్‌బ్రిడ్జితో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ నాటికి పూర్తిచేయాలన్నారు. భద్రకాళి చెరువు ప్రాంతంలో ఇంతవరకు 3.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, రూ.2.06 కోట్ల విలువైన మట్టిని విక్రయించామని అధికారులు వివరించారు. సీఎం ప్రకటనకు అనుగుణంగా వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియానికి అవసరమైన భూమి గుర్తించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా వరంగల్ నగరాన్ని రెండో రాజధానిగా చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, ప్రభుత్వ ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకుని అధికార యంత్రాంగం పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్, టెండర్, పనులు ప్రారంభించడానికి, పూర్తిచేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని చెప్పారు.

ఆస్పత్రిలోకి వచ్చిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది



మెట్లపై నుంచి కారుతున్న వర్షపు నీరు



ఆస్పత్రిలో వర్షపు నీరు



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఆస్పత్రి జలమయం

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం రెండు అంతస్తులపై మరో అంతస్తు నిర్మాణ పనులు చేపడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వర్షం నీరు పై అంతస్తు మెట్లపై నుంచి కిందికి వస్తున్నాయి. మెట్లు, వరండాతో పాటు ఆస్పత్రి జలమయమవుతుంది. నీరు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోగులు, ఆస్పత్రి సిబ్బందికి శాపంగా మారింది. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, రోగుల అటెండెన్స్ జారీ పడుతున్నారు. శనివారం నర్సింగ్ ఆఫీసర్ ఒకరు జారీ కిందపడటంతో నడుము భాగంలో గాయమైనట్లు తెలిసింది.

- భూపాలపల్లి అర్బన్

క్లుప్తంగా

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

- సెమీస్‌కు చేరిన జట్లు



క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న షట్లర్లు

వరంగల్ స్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లా అమ్యోచూర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ క్లబ్, కిట్స్ కళాశాల ఇండోర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో 20 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. రెండో రోజు జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడిన పలు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీ ఫైనల్‌ను పూర్తి చేసుకుని నేడు(ఆదివారం) ఫైనల్ మ్యాచ్ ఉంటుందని బ్యాడ్మింటన్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్ తెలిపారు.

పాఠశాలల విద్యార్థులకు ఆధార్



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న కొంతమంది విద్యార్థులకు ఆధార్ లేకపోవడం, మరికొందరి ఆధార్‌లో తప్పులు ఉండడంతో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)లో నమోదు కావడం లేదు. దీంతో జిల్లాలో ఇప్పటివరకు 65 శాతం మంది విద్యార్థుల వివరాలు మాత్రమే అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 35 శాతం అపార్‌లో నమోదు కావాల్సి ఉంది. వీటిని సరిచేసేందుకు విద్యాశాఖ ఉపక్రమించింది. అందుకు హనుమకొండ జిల్లాకు బాట్రానిక్స్ కంపెనీ వారికి కాంట్రాక్టు ఇచ్చింది. కంపెనీ ప్రతినిధులు అన్ని మండలాల్లో ఆధార్ కోఆర్డినేటర్లను నియమించుకొని పాఠశాలలకే వచ్చి ఆధార్ నమోదు చేస్తారు. వివరాలు తప్పులున్న ఆధార్‌లో సరిచేసి మళ్లీ ఆధార్ పొందేందుకు, కొత్తగా తీసుకునేవారికి కూడా పాఠశాలల్లోనే ఆధార్ నమోదు ప్రక్రియ ఇటీవల ప్రారంభమైంది. ప్రస్తుతం జిల్లాలోని ఆత్మకూరు, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు మండలాల పాఠశాలల్లోనే ఆధార్ నమోదు చేస్తున్నారు. విద్యార్థుల ఆధార్ సరిచేసేవిధంగా, నమోదు ప్రక్రియ జరిగేలా పాఠశాలల హెచ్‌ఎంలు చూడాలని డీఈఓ వాసంతి ఆదేశించారు.

> 2023, జూలై 27 తెల్లవారుజామున 4 గంటల సమయం. జయశంకర్ భూపాలపల్లి మండలం మోరంచపల్లి ఊరంతా గాఢ నిద్రలో ఉంది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఇళ్లలోకి నీరొచ్చింది. చెరువును తలపించడంతో జలప్రళయం ముంచుకొచ్చిందని భావించిన గ్రామస్తులంతా బయటకు పరుగులు తీసి బిల్డింగ్‌లపైకి ఎక్కి ఆర్తనాదాలు చేశారు. ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో నలుగురు వరద నీటిలో కొట్టుకుపోయారు. మోరంచవాగు ఉప్పొంగి మోరంచపల్లి గ్రామంలో రెండేళ్ల క్రితం జరిగిన ఈ జల ప్రళయాన్ని గ్రామస్తులు ఇంకా మరువలేకపోతున్నారు.

> ఆ రోజు అంతా నిశబ్దంగా ఉంది. వరద వస్తుంది.. పోతుందని ఆ గ్రామస్తులు అనుకున్నారు. కానీ అంతలోనే జలప్రళయం. వరద ఉధృతి ఎనిమిది మందిని పొట్టనపెట్టుకుంది. సరిగ్గా ఇదే రోజు 2023 జూలై 27న సాయంత్రం సమయంలో ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని జంపన్న వాగు ఉధృతికి ఏటూరునాగారం మండలం కొండాయిలో ఎనిమిది మంది జలసమాధి అయ్యారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, తల్లిదండ్రులు, బంధువులు కూడా వరదలో కొట్టుకుపోయి విగత జీవులుగా మారారు. విషాదకర ఘటనకు రెండేళ్లు నిండాయి. ఆ చేదు జ్ఞాపకాలు గ్రామస్తులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి.

జల విషాదానికి రెండేళ్లు..

- జంపన్నవాగు ఉధృతికి కొండాయిలో ఎనిమిది మంది జలసమాధి
- మోరంచవాగు వరద నీటిలో కొట్టుకుపోయి ముగ్గురి మృతి
- నేటికీ లభించని మహాలక్ష్మి ఆచూకీ

2023, జూలై 27న వరదతో నీట మునిగిన మోరంచపల్లె, కొండాయి గ్రామాలు



వరదలో గల్లంతై చనిపోయిన ఎనిమిది మంది మృతదేహాలు (ఫైల్)



కొండాయి వద్ద కూలిన బ్రిడ్జి ప్రస్తుత పరిస్థితి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామంలో జంపన్న వాగు ఉధృతికి ప్రమాదవశాత్తు వాగులో పడి ఎనిమిది మంది మృతి చెందారు. ఎగువ కురుస్తున్న వర్షాలకు జంపన్నవాగు ఉప్పొంగడంతో కొండాయి గ్రామాన్ని నీరు చుట్టుముట్టింది. ఇళ్లలోకి వరద నీరు వస్తుందనే భయంతో మల్యాల గ్రామం వైపు సురక్షిత ప్రాంతాలకు వెళ్తుండగా మధ్యలో ఉన్న కల్వర్టు వద్ద పైపు తొలగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. అది గమనించని గ్రామస్తులు కొండాయి నుంచి వచ్చే ఆ ఎనిమిది ఒకరి తర్వాత ఒకరు పడి గల్లంతయ్యారు. మరుసటి రోజు పొలాల వద్ద విగత జీవులుగా పడి ఉన్నారు. నాటి జ్ఞాపకాలు, ఇబ్బందులు ఇప్పటికీ ఆ గ్రామస్తులను వెంటాడుతున్నాయి. ఇళ్లు కట్టిస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదు. శాశ్వతంగా రోడ్లు, ములుగు కాల్వల నిర్మాణాలు జరగడం లేదు. జనవాసాలను అక్కడి నుంచి దొడ్లకు తరలిస్తామని చెప్పిన పాలకులు ఇంత వరకు ఆ హామీని ఆచరణలోకి తీసుకురాలేదు.

ఉపద్రవాన్ని మరువని మోరంచపల్లి..



2023 జూలై 27న మోరంచవాగు వరద ఉధృతి(ఫైల్)

భూపాలపల్లి: ఎగువన భారీ వర్షాలు కురువడం, చెరువుల కట్టలు తెగిపోవడంతో 2023 జూలై 27వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు భూపాలపల్లి మండలం మోరంచవాగు ఉప్పొంగి మోరంచపల్లి గ్రామం మొత్తం వరదనీటిలో మునిగింది. ఊరంతా జలమయం కావడంతో 280 ఇళ్లలోని సుమారు వెయ్యి మంది బిల్డింగ్‌ల పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ, గంగిడి సరోజన, గడ్డం మహాలక్ష్మి వాగు వరదలో కొట్టుకుపోయారు. రెండు, మూడు రోజులకు ఓదిరెడ్డి, వజ్రమ్మ, సరోజన మృతదేహాలు లభించగా మహాలక్ష్మి ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు. గ్రామం జలమయం కావడంతో 126 గేదెలు, 3 దుక్కిటెద్దులు మృత్యువాత పడ్డాయి. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. కాగా అప్పటి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున, మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. మహాలక్ష్మి ఆచూకీ లభించకపోవడంతో ఆర్థిక సాయం అందించలేదు. ఇటీవల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆ కుటుంబానికి కూడా రూ. 5 లక్షల సాయం అందజేశారు.



వరద ఉధృతి తగ్గాక మోరంచపల్లి గ్రామం (ఫైల్)

చేపట్టని శాశ్వత పనులు..

ఈ రెండేళ్లలో మరోమారు ఇలాంటి ఘటన చోటుచేసుకున్నా గ్రామానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ఎలాంటి శాశ్వత పనులు చేపట్టలేదు. భారీ వర్షాలు కురిస్తే వాగు ఒడ్డు ఇళ్లకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. వాగుపై నిర్మించిన, పక్కనే ఉన్న మరో బ్రిడ్జిని పూర్తిగా తొలగించి సుమారు 500 మీటర్ల దూరం హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తే ఎంతటి వరదలొచ్చినా గ్రామానికి ముప్పు వాటిల్లదు. ఈ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమ్మానాన్న ఒకేసారి మరణించారు..



ఇంట్లోకి వరద వస్తుందని ప్రాణాలను కాపాడుకునేందుకు కొండాయి, మల్యాల గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టును మా అమ్మ కరీమాబీ, మా తండ్రి రషీద్‌ఖాన్ దాటబోయి ఇద్దరు ఒకేసారి మరణించారు. ఆ దుర్ఘటన ఇంకా మర్చిపోలేకపోతున్నాం. అప్పటి నుంచి ఏటూరునాగారంలోనే జీవిస్తున్నాం. మారుమూల గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

రఫీ, కొండాయి గ్రామస్తుడు

భయంతో బతుకుతున్నాం..



గ్రామానికి ఇప్పటి వరకు ఎలాంటి రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలం వస్తుందంటే భయంతో బతుకుతున్నాం. కొండాయి గ్రామం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి సౌకర్యాలు లేకుండానే జీవిస్తున్నాం.

- పిచ్చి సమ్మక్క, కొండాయి గ్రామస్తురాలు

కరకట్ట నిర్మించాలి..



రెండేళ్ల క్రితం వచ్చిన వరదలు ఇంకా మరచిపోలేకపోతున్నాం. మోరంచవాగుతో గ్రామానికి ముప్పు వాటిల్లకుండా ఉండాలంటే పది మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించాలి. అలాగే, 500 మీటర్ల పొడవుతో పెద్ద బ్రిడ్జి నిర్మించి వాగును ఇంకా కొద్దిగా వెడల్పు చేస్తే గ్రామానికి వరద ముప్పు రాదు. మరోమారు అలాంటి ఘటనలు చోటు చేసుకోవు.

- వర్ధం రోహిత్, మోరంచపల్లి

వాగు నా బిడ్డను ఆగం చేసింది..



రెండేళ్ల కింద వచ్చిన మోరంచ వాగు వరదలో నా బిడ్డ మహాలక్ష్మి కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు జాడ దొరకలేదు. నా బిడ్డ పోయినంక, ఆ బాధ తట్టుకోలేక నా అల్లుడు హైదరాబాద్‌కు పోయి మా మనువరాలి దగ్గర ఉంటుండు. వరద మా కుటుంబాన్ని ఆగం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం సాయం అందించింది. నా ఇల్లు కూలిపోయేటట్టు ఉంది. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ముసలితనంలో నాకు కాస్త గూడు ఉంటది.

- బతుకమ్మ, మహాలక్ష్మి తల్లి, మోరంచపల్లి

మూడు నిమిషాల్లోనే ఊరు మునిగింది..



2023 జూలై 27వ తేదీ గుర్తుకొస్తే వెన్నులో వణుకుపడుతుంది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఒక్కసారిగా ఇళ్లలోకి నీరు రాసాగింది. బయటకు వచ్చి చూడగా మోరంచ వాగు వరద భారీగా వస్తోంది. వెంటనే నేను, నా భార్య, కూతురు బిల్డింగ్ పైకి ఎక్కి బిక్కుబిక్కుమంటూ గడిపాం. క్షణాల్లోనే ఇల్లు వరద నీటితో నిండింది. మూడు నిమిషాల్లోనే ఊరు మునిగింది.

- నూకల నర్సింహారెడ్డి, మోరంచపల్లి

ఆర్టీసీ బస్సు, కారు ఢీ..

- ముగ్గురికి స్వల్ప గాయాలు



ఘటనాస్థలిలో ఆర్టీసీ బస్సు, కారు

చిట్యాల: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం మండలంలోని కొత్తపేట శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మికుంట నుంచి జయశంకర్ భూపాలపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు కొత్తపేట బస్టాండ్ వద్ద ఆగి ప్రయాణికులను ఎక్కించుకుని కదులుతోంది. ఈ క్రమంలో ఎదురుగా కారు అతివేగంగా వచ్చి బస్సును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు టీచర్లు, ఆర్టీసీ బస్సులో ఉన్న మరో ప్రయాణికుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరు టీచర్లను 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై శ్రావన్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణించి గాయపడిన కొత్తపేటకు చెందిన చంద్రయ్యను తన వాహనంలో చిట్యాల సివిల్ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ గోలి జనార్ధన్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని..

- బావను హత్య చేసిన బావమరిది, అతడి భార్య
- ఈ ఘటనలో ఇద్దరి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : తనకు తెలియకుండానే తన 3.10 ఎకరాల వ్యవసాయ భూమిని బావ, అక్క, మరో ఇద్దరు అక్కలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆగ్రహంతో సొంత బావను బావమరిది, అతడి భార్య కలిసి హత్య చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో ఈ నెల 23వ తేదీన జరిగిన ఉప్పలయ్య హత్య కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎన్.తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు హత్య వివరాలను రూరల్ పీఎస్‌లో వెల్లడించారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొనకొండ చెన్నయ్య, రాజమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు మల్లేశ్ ఉండగా ఒక కుమార్తె మృతిచెందింది. చెన్నయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమి నుంచి 3.10 ఎకరాలను మల్లేశ్ పెద్ద అక్క కోమల, మరో ఇద్దరు అక్కలు అతడికి తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సదరు భూమి తగదా విషయంలో పలుమార్లు పంచాయితీలు జరగగా మల్లేశ్ పెద్ద బావ ఉప్పలయ్య పెద్దరికం వ్యవహరించి అందుకు సరేనని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో తన భూమిని తనకు మళ్లీ రిజిస్ట్రేషన్ చేయమంటే ఉప్పలయ్య మాటవినకపోగా డబ్బు కావాలని డిమాండ్ చేశాడు. మల్లేశ్ డబ్బు ఇచ్చినా భూమి మాత్రం రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో మల్లేశ్ తన బావపై కక్ష పెంచుకుని అవకాశం కోసం ఎదురుచూశాడు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీన ఉప్పలయ్య గ్రామ శివారులోల గొర్రెలు మేపేందుకు వెళ్లగా పథకం ప్రకారం మల్లేశ్, తన భార్య ఉమ కలిసి ఉప్పలయ్యను ఇనుప రాడ్‌తో కొట్టగా అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. భూవివాదమే చిలికిచిలికి గాలివానలా మారి చివరకు ఉప్పలయ్య హత్యకు దారితీసిందని డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, కేసముద్రం ఎస్సైలు కరుణాకర్, నరేశ్, రవికిరణ్, రూరల్ ఎస్సై దీపిక పాల్గొన్నారు.

దూరవిద్య ఇయర్ వైజ్ డిగ్రీ పరీక్షల టైంటేబుల్ విడుదల

సాక్షి ఎఫెక్ట్..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూర విద్య సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ఇయర్ వైజ్ డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ప్రథమ ఎక్స్, ద్వితీయ ఎక్స్, ఫైనలియర్ రెగ్యులర్, ఎక్స్ పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ శనివారం విడుదల చేశారు. గతేడాది జూలైలో డిగ్రీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. అనంతరం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఫీజులు వసూలు చేసి నిర్వహించలేదు. మళ్లీ ఈఏడాది జూలై నెల చివరికి వచ్చినా వార్షిక పరీక్షలు నిర్వహించడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న అంశంపై 'దూరవిద్య డిగ్రీ పరీక్షల ఎప్పుడో' అనే శీర్షికతో 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై స్పందించిన పరీక్షల విభాగం అధికారులు టైంటేబుల్‌ను విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులకు ఆగస్టు 22 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఆగస్టు 22, 26, 30, సెప్టెంబర్ 3, 8, 11, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 23 నుంచి నిర్వహించనున్నారు. ఆగస్టు 23, 28, సెప్టెంబర్1, 4, 9,12, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 25 నుంచి నిర్వహిస్తారు. ఆగస్టు 25, 29, సెప్టెంబర్ 2, 6, 10, 15, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు సంబంధిత కేయూ దూరవిద్య వెబ్‌సైట్‌లోఉన్నాయని వారు తెలిపారు.

నెల రోజులకు స్వదేశం చేరిన మృతదేహం

- అశ్రునయనాల మధ్య నవీన్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి
- శోకసంద్రంలో తల్లిదండ్రులు, మునిగలవీడు గ్రామస్తులు



నవీన్‌కుమార్ (ఫైల్)

నెల్లికుదురు : మనస్తాపంతో నెల రోజుల క్రితం లండన్‌లో మృతి చెందిన ఓ యువకుడి మృతదేహం శనివారం స్వదేశం చేరగా అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన నల్లాని బీంరావు,రమాదేవి దంపతులకు కుమారుడు నవీన్ కుమార్ (29), కూతురు ఉంది. ఉన్నత చదువు కోసం నవీన్ కుమార్ నాలుగేళ్ల క్రితం లండన్ వెళ్లాడు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కాని మనస్తాపంతో గత నెల 28వ తేదీన ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి అధికారులు ఈ నెల 3న నవీన్‌కుమార్‌గా గుర్తించి 9న మృతుడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని లండన్ నుంచి స్వదేశానికి తరలించడానికి మాజీ సర్పంచ్ నల్లాని నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీ నల్లాని శోభాపాపారావు.. వెలమ సంఘం రాష్ట్ర నాయకుడు ఉసిరికపల్లి వాసుదేవరావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేటీఆర్ లండన్‌లోని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్, ఇండియన్ ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరిపారు. దీంతో నవీన్‌కుమార్ మృతదేహం శుక్రవారం హైదారాబాద్ చేరింది. శనివారం స్వగ్రామం మునిగలవీడుకు తరలించగా కుమారుడి మృతదేహం మీదపడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. 'ఉన్నత భ్యాసం చేసి ప్రయోజకుడవై వస్తావనుకుంటే ఇలా శవమై వచ్చావా బిడ్డా' అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అశ్రునయనాల మధ్య నవీన్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

ఎట్టకేలకు ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులు

- కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ




పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిలో నలుగురికి ఎట్టకేలకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులు లభించాయి. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అప్రూవల్ మేరకు శనివారం రిజిస్ట్రార్ వి. రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఆరేళ్లుగా ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతుల కల్పన జరగలేదు. సీనియారిటీ వివాదం నేపథ్యంలో జాప్యం జరుగుతూ వచ్చింది. దీనిపై గతంలోనే కేయూలో కీలక పోస్టులు ఖాళీ అని, ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులు కల్పించడం లేదని, యూనివర్సిటీలో నాలుగు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు వెకెన్సీలుగా ఉన్నాయని, పదోన్నతుల కల్పించాలని 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో వీసీ ప్రతాప్‌రెడ్డి.. ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పనపై అందుకు ఉన్న అవరోధాలను అధిగమించేందుకు దృష్టి సారించారు. చివరకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందిన వారిలో యూనివర్సిటీలో యూజీసీ యూనిట్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న హబీబుద్దీన్, పరిపాలన భవనంలో టీచింగ్‌అండ్‌గెజిటెడ్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్, ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎల్. రాము, పరీక్షల విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం నర్సింహారావు ఉన్నారు. కాగా, ప్రస్తుతం పనిచేస్తున్న విభాగాల్లోనే వీరు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వీరిని బోధన, బోధనేతర ఉద్యోగులు అభినందించారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- టెమ్రిస్ డిప్యూటీ సెక్రటరీ జుబేదా



విలేకరులతో మాట్లాడుతున్న జుబేదా

న్యూశాయంపేట : పేద మైనారిటీలకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) డిప్యూటీ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్ జుబేదా అన్నారు. శనివారం హనుమకొండ ములుగురోడ్డులోని రీజినల్ లేవల్ కో-ఆర్డినేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించి వాటికి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీటిలో బాలురకు వరంగల్, జక్కలొద్ది బాలుర గురుకులం, బాలికలకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని బాలికల గురుకులంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని, ఎంపికైన వారికి త్వరలో నియామక పత్రాలు అందిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యనందిస్తున్న గురుకులాలను పేద మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. సమావేశంలో రీజినల్ లేవల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జంగా సతీశ్, విజిలెన్స్ ఆఫీసర్లు సయ్యద్ అక్బర్, మక్బూల్‌పాషా, ఉర్దూ ఆఫీసర్ జాహేదా బేగం, తదితరులు పాల్గొన్నారు.

3న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఆగస్టు 3వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరగనున్న పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు పురస్కారంతోపాటు ప్రశంస పత్రాలు, పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల పేర్లు నమోదు , ఇతర పూర్తి వివరాలకు 9059522986 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.